చినుకు పడితే చిత్తడే...

- వర్షాలకు దెబ్బతిన్న లింకు రోడ్లు
- కోతకు గురవుతున్న మట్టి దారులు
- పెద్దవాగుపై పూర్తికాని వంతెనల నిర్మాణం
- గ్రామీణులకు తప్పని రవాణా దూర భారం



కోరుట్ల-సంగెం మధ్య అసంపూర్తి వంతెన, పక్కనే కోతకు గురైన తాత్కాలిక మట్టి రోడ్డు

కోరుట్ల రూరల్: మండలంలో వర్షాకాలం వచ్చిందంటే రహదారులన్నీ బురదమయమై ప్రయాణికులకు ఇబ్బందులు తప్పటం లేదు. పలు గ్రామాల మధ్య ఉన్న లింకు రోడ్డు వర్షాలకు దెబ్బతిన్నాయి. గ్రామాల మధ్య ఉన్న వాగుల్లో తాత్కాలికంగా వేసుకున్న మట్టి దారులు భారీ వర్షానికి కోతకు గురయ్యాయి. దీంతో గ్రామాల మధ్య రాకపోకలు నిలిచి పోయాయి. పెద్ద వాగుపై నిర్మిస్తున్న వంతెనల పనులు గత 8 ఏళ్లుగా నత్తనడకగా సాగుతూ అసంపూర్తిగా మిగిలాయి. దీంతో గ్రామీణులు పక్క గ్రామాలకు వెళ్లాలన్నా, మండలకేంద్రం కోరుట్లకు రావాలన్నా రవాణా దూరభారం తప్పడం లేదు.

చిత్తడైన లింకురోడ్డు..

ఎనిమిదేళ్ల ఏళ్ల క్రితం ప్రధానమంత్రి సడక్ యోజనలో భాగంగా చిన్నమెట్‌పల్లి-వెంకటాపూర్ గ్రామాల మధ్య బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఆ రోడ్డుపై తరచూ కేజీవీల్ ట్రాక్టర్లు నడుస్తుండటంతో పాటు వర్షానికి తారు లేచి పోయి, వర్షాలకు చిత్తడిగా మారి ప్రయాణికులు నడవలేని పరిస్థితి నెలకొంది. ఈ దారి గుండా చిన్న మెట్‌పల్లి ప్రయాణికులు కోరుట్లకు వెళ్తే 5 కిలో మీటర్ల దూరభారం తగ్గుతుంది.

కంకర వేసి వదిలేశారు..

మండలంలోని సంగెం-నాగులపేట గ్రామాల మధ్య బీటీ రోడ్డు నాలుగేళ్ల క్రితం తారు లేచి పోయి గుంతలమయం కావటంతో మరమ్మతుల కోసం కోరుట్ల జంబిగద్దె నుంచి సంగెం మీదుగా నాగులపేట వరకూ రూ.1.30 కోట్లు మంజూరయ్యాయి. రోడ్డు పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ సంగెం నుంచి నాగులపేట వరకూ రోడ్డుపై కాంక్రిట్ వేసి తారు వేయక అలాగే వదిలేయటంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

పూర్తి కాని వంతెనల నిర్మాణం..

కోరుట్ల మండలంలోని సంగెం, నాగులపేట, కథలాపూర్ మండలం తక్కళ్లపెల్లి, బొమ్మెన గ్రామాల ప్రజలు కోరుట్లకు వెళ్లేందుకు పెద్దవాగుపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. కానీ పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. సంగెం-యెఖీన్‌పూర్ గ్రామల మధ్య పెద్ద వాగుపై వంతెనకు రూ.5.5 కోట్లు మంజూరైనా 8 ఏళ్లుగా పనులు పూర్తి కాక అసంపూర్తిగానే ఉంది. తాత్కాలికంగా రోడ్డు ఏర్పాటు చేసుకున్నప్పటికీ వర్షాకాలం కొట్టుకుపోతున్నాయి.

బీటీ రోడ్డుకు నోచుకోని మట్టి దారి..

సంగెం -యెఖీన్‌పూర్ గ్రామల మధ్య గల మట్టి దారి ఇప్పటికీ బీటీ రోడ్డుకు నోచుకోలేదు. ఈ దారిగుండా కోరుట్ల మండల ప్రజలే కాకుండా మేడిపెల్లి మండలంలోని పలు గ్రామాల ప్రయాణికులు యెఖీన్‌పూర్ మీదుగా మెట్‌పల్లి మండలం వెళ్తుంటారు. సంగెం-నాగులపేట ప్రజలు కూడా ఈ దారి గుండా కోరుట్ల పట్టణంతో పాటు మెట్‌పల్లి మండలం పెద్దాపూర్, కోనరావుపేట గ్రామాలకు వెళ్తుంటారు. వర్షాకాలం మట్టి రోడ్డు చిత్తడిగా మారి ప్రయాణికులు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ లింకు రోడ్లకు మరమ్మతులు చేపట్టి, పెద్ద వాగుపై ద్య రవాణా దూర బారం తగ్గించేందుకు వంతెనల నిర్మాణ పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



చిన్నమెట్‌పల్లి-వెంకటాపూర్ మధ్య లింకురోడ్డు

కంకర రోడ్డుపై ఇబ్బందిగా ఉంది



సంగెం నుంచి ప్రతీ రోజు నాగులపేట హైస్కూల్‌కు వెళ్తుంటాం. రోడ్డు కంకర పోసి వదిలేయటంతో రోడ్డుపై వెళ్లటం ఇబ్బందిగా ఉంది. బస్సు మిస్సయితే సైకిల్‌పై లేదా నడిచి వెళ్తుంటాం. కంకర రాళ్ల తగిలి ఇబ్బందిగా ఉంటుంది.

– నల్ల వేదవ్యాస్ 8వ తరగతి, సంగెం.

శాశ్వత చర్యలు చేపట్టాలి



చిన్నమెట్‌పల్లి-వెంకటాపూర్ మధ్య లింకు రోడ్డు వల్ల మా గ్రామస్తులు కోరుట్ల వెళ్లేందుకు ఎంతో ఉపయోగ పడుతుంది. ఈ రోడ్డు గతంలో బీటీ రోడ్డుగా మార్చినప్పటికీ వర్షాలకు బీటీ లేచి పోయింది. తాత్కాలికంగా ప్రతీ ఏటా మొరం వేస్తున్నారు. ఈ రోడ్డుకు శాశ్వత పరిష్కారం చూపించాలి.

– పంచిరి విజయ్ కుమార్, మాజీ ఎంపీటీసీ చిన్నమెట్‌పల్లి

ప్రతిపాదనలు పంపించాం

యెఖీన్‌పూర్-సంగెం, కోరుట్ల-సంగెం మధ్య వాగులో వంతెనల పనులు పూర్తి చేసేందుకు నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్లకు అగ్రిమెంట్ కూడా పూర్తయింది. వర్షాకాలం తగ్గగానే అక్టోబర్, నవంబర్‌లో పనులు ప్రారంభమవుతాయి. చిన్నమెట్‌పల్లి-వెంకటాపూర్ రోడ్డు పనులకు నిధుల కోసం ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వాటికి త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. చేపడుతాం.

– సత్యనారాయణ, డీఈ, పంచాయతీరాజ్

క్లుప్తంగా

అంబేడ్కర్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం



అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న శ్రావణి

జగిత్యాలటౌన్: ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగాన్ని లిఖించి మహిళలు సబ్బండ వర్గాలకు న్యాయం చేసిన మహనీయుడు అంబేడ్కర్ అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి అన్నారు. ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ (డిక్కీ) ఆధ్వర్యంలో జగిత్యాల తహసీల్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం పూలమాల వేసి నివాళి అర్పించారు.మహిళలకు ప్రత్యేక హక్కులు కల్పించడంతో పాటు అన్ని వర్గాల వారికి సమాన హక్కులు కల్పించిన మహనీయుడని కొనియాడారు. అంబేడ్కర్ స్మరణ కార్యక్రమ నిర్వాహకుడు శ్యాంను శ్రావణి అభినందించారు. కార్యక్రమంలో డిక్కీ జిల్లా అధ్యక్షుడు నల్ల శ్యాం, ద్యావర సంజీవరాజు, మ్యాదరి అశోక్, మద్దెల నారాయణ, ఆముద రాజు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై నరేశ్‌కుమార్

మల్యాల: రెండు నెలల క్రితం పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ సాంకేతిక పరిజ్ఞానంతో కనుక్కొని బాధితుడికి అప్పగించినట్లు మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. మండలంలోని తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన గుండా చందు రెండు నెలల క్రితం తక్కళ్లపల్లిలో తన సెల్‌ఫోన్ పోగొట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని, సీఈఐఆర్ సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్‌ను ట్రాక్ చేసి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, ఆదివారం ఏఎస్సై రుద్రకృష్ణతో కలిసి బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగించామని ఎస్సై తెలిపారు.

గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి

కథలాపూర్: కథలాపూర్ మండలం చింతకుంట, పెగ్గెర్ల, భూషణరావుపేట, ఊటిపెల్లి, కోనాపూర్ గ్రామాలకు ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యం కల్పించాలని మాజీ ఎంపీటీసీ కొండ ఆంజనేయులు, టీఆర్ఎస్ నాయకులు తీట్ల శంకర్ ఆదివారం కోరారు. గతంలో ఈ రూట్‌లో కోరుట్ల నుంచి ఆయా గ్రామాలకు ఉదయం మూడు ట్రిప్పులు, సాయంత్రం మూడు ట్రిప్పులు బస్సు సౌకర్యం ఉండేదన్నారు. కొన్ని నెలలుగా ఈ రూట్‌లో బస్సు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందిపడుతున్నారని, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని యథావిధిగా గా బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

ఆధునిక పద్ధతులతో అధిక లాభాలు

మల్లాపూర్: రైతులు సాంప్రదాయ విధానాలు వీడి అధునాతన పద్ధతుల్లో వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులతో పాటు లాభాలు వస్తాయని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి చేపూరి విజయ్ అన్నారు. ఆదివారం రైతు వేదికలో భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో రైతులకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో పాల్గొని మాట్లాడారు. వ్యవసాయంలో తక్కువ యూరియా వాడకం, అవసరం మేరకు రసాయన మందులను వినియోగం వంటి అంశాలపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి దోనూరి రాము, జిల్లా అధ్యక్షుడు భూమరెడ్డి, రాజేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గంగారెడ్డి, జిల్లా రెవెన్యూ ప్రముఖ్ లక్ష్మణ్, మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ



రమేశ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

రాయికల్: ఇటీవల గుండెకు స్టంట్ వేయించుకున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేశ్, కూరగాయల ప్రభాకర్‌ను, అనారోగ్యంతో బాధపడుతున్న శాంతమూర్తిల ను ఆదివారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పరామర్శించారు. ఆయన వెంట సింగిల్‌విండో చైర్మన్ ఏనుగుమల్లారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ మోర హన్మాండ్లు, నాయకులు మహేందర్ బాబు, పల్లికొండ గంగాధర్, గన్నవరం ప్రభాకర్, నారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థులు



విద్యార్థినులతో పీడీ వెంకటలక్ష్మి

జగిత్యాలరూరల్/జగిత్యాలటౌన్: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ వెంకటలక్ష్మి తెలిపారు. ఆదివారం జగిత్యాల మినీ స్టేడియంలో జరిగిన అండర్-15 వాలీబాల్ పోటీల్లో చల్‌గల్ పాఠశాలకు చెందిన గమ్య, గీతిక అత్యంత ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 18,19 తేదిల్లో రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నంలో జరుగనున్న రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో వీరు పాల్గొటారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై న గమ్య, గీతికలను పాఠశాల హెచ్ఎం లలితా దేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

తుంగూర్ విద్యార్థి ఎంపిక



శ్రీహర్ష

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తుంగూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి శీలం శ్రీహర్ష రంగారెడ్డి జిల్లాలో నేటి నుంచి జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. తుంగూర్ జడ్పీహెచ్ఎస్‌లో 9వ తరగతి చదువుతున్న శ్రీహర్ష జగిత్యాల జిల్లా కేంద్రంలో అండర్ -15 డిస్ట్రిక్ట్ లెవల్ వాలీబాల్ క్రీడల్లో అత్యంత ప్రతిభ కనబరచాడు. ఈ నెల 18,19 తేదీల్లో హైదరాబాద్‌లో ఇబ్రహీంపట్నం విద్యాపీఠంలో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడల్లో శ్రీహర్ష పాల్గొననున్నాడు. ఈ మేరకు శ్రీహర్షను ఫిజికల్ డైరెక్టర్ చిత్రం లక్ష్మణ్, హెచ్ఎం భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు కుమార్ అభినందించారు.



శివకుమార్

మల్యాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి ఇ.శివకుమార్ జిల్లా అండర్-15 విభాగం వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 18,19 తేదీల్లో రంగారెడ్డిలో నిర్వహించే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో అండర్-15 విభాగంలో శివకుమార్ పాల్గొంటాడని హెచ్ఎం అనుపమ, పీడీ విశ్వప్రసాద్ తెలిపారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే ఇల్లు కూలింది



ధర్మపురిలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

ధర్మపురి: కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వలనే అనసూర్య ఇల్లు కూలిపోయిందని బాధితురాలికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని బీజేపీ నాయకులు డిమాండు చేశారు. ధర్మపురి పట్టణంలోని 3, 11,12,13 వార్డుల్లో జరుగుతున్న సీసీ రోడ్లు, డ్రైయినేజీ పనులను ఆదివారం బీజేపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 12 వార్డులో జరుగుతున్న డ్రైనేజీ పనులతో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఇంటి చుట్టు నీరుచేరి అనసూర్య ఇల్లు కూలిపోయిందన్నారు. అంతే కాకుండా లక్షలాది రూపాయలతో చేపడుతున్న రోడ్లు, డ్రైనేజీ పనుల్లో నాణ్యత లోపిస్తుందని సంబంధిత అధికారులు పనులను పరిశీలించాలని డిమాండ్ చేసారు. మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రజల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గాజు భాస్కర్, బెజ్జారపు లవన్‌కుమార్, పల్లెర్ల సురేందర్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా విక్రేతపై కేసు నమోదు

గొల్లపల్లి: మండల కేంద్రంలోని ఒడ్డెర కాలనీకి చెందిన ఒల్లెపు మల్లేశం అనే వ్యక్తి ఆదివారం గుడుంబా విక్రయిస్తుండగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి తెలిపారు. గుడుంబా విక్రయిస్తున్నాడనే పక్కా సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో కలిసి ఇంట్లో అనుమానాస్పదంగా తనిఖీలు చేయడంతో 5 లీటర్ల గుడుంబా దొరికింది. మల్లేశంపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గుడుంబా అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై పేర్కొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే బీజేపీ ధ్యేయం



ప్రొసీడింగ్ పత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

మెట్‌పల్లి రూరల్: అన్ని వర్గాల సంక్షేమమే బీజేపీ ధ్యేయమని ఆ పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరిబాబు అన్నారు. మెట్‌పల్లి మండల ఆర్ఎంపీ.పీఎంపీల సంఘ భవన నిర్మాణానికి ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.3 లక్షల నిధులు మంజూరుకాగా, ప్రొసీడింగ్ పత్రాలను ఆదివారం వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ అర్వింద్ చొరవతో నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఎంతో అభివృద్ధి జరిగిందని గుర్తుచేశారు. అభివృద్ధి,సంక్షేమం కోసం నిరంతరం పాటుపడేది బీజేపీ ఒక్కటేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్,రాజేందర్, రాజ్‌పాల్‌రెడ్డి, శ్రీధర్, మల్లేశ్, వెంకటేశ్, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవేంకటేశ్వర ఆలయంలో పూజలు



ఆది శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఆలయ చైర్మన్

కోరుట్ల: పట్టణంలోని అతి పురాతన శ్రీ వేంకటేశ్వర ఆలయాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదం అందజేశారు. ఆలయ చైర్మన్ యతిరాజం నర్సయ్య ప్రభుత్వ విప్‌ను సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు,ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

మల్యాల చేరుకున్న పీఎం మోడీ కానుక



మల్యాలకు చేరుకున్న సైకిళ్లు

మల్యాల: కేంద్ర హోంశాఖ సహాయంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పీఎం మోడీ కానుక పేరిట విద్యార్థులకు అందజేస్తున్న సైకిళ్లు ఆదివారం మల్యాలకు చేరుకున్నాయి. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు సుమారు 270 వరకు ఇవ్వనున్నారు. ఆదివారం మల్యాల తక్కళ్లపల్లి, బల్వంతాపూర్, మల్యాల జిల్లా పరిషత్ పాఠశాలలకు సైకిళ్లు రాగా, బీజేపీ నాయకులు మల్లేశం, రవి పరిశీలించారు.



కోరుట్లటౌన్:పట్టణంలోని వినోభారోడ్‌లో 4 నెలల క్రితం మురికి కాలువ దెబ్బతింది. వానలు పడుతున్న క్రమంలో మురికి నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు పెరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురికి కాలువ నిర్మించి మురికి నీరు వెళ్లేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను కోరుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు దృష్టి సారించి సమస్య వెంటనే పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రవీందర్ గౌడ్, బల్దియా కమిషనర్, కోరుట్ల సెల్ నంబర్: 9849905880

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

కిక్కిరిసిన బస్టాండ్



ప్రయాణికులతో కిక్కిరిసిన జగిత్యాల బస్టాండ్



జగిత్యాలటౌన్: కృష్ణాష్టమి, ఆదివారం వరుసగా రెండు రోజుల వరుస సెలవుల తర్వాత తిరిగి వెళ్తున్న ప్రయానిణికులతో ఆదివారం జగిత్యాల బస్టాండ్ కిక్కిరిసిపోయింది. రద్దీకి సరిపడా బస్సులు లేకపోవడంతోనే తరచూ ఇలాంటి పరిస్థితి ఏర్పడుతుందని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు. పండుగలు,సెలవుల వేళ బస్సుల్లో అడుగు పెట్టే పరిస్థితి లేక ప్రయాణం నరకప్రాయంగా మారుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచాలని ప్రయాణికులు డిమాండ్ చేశారు.


ప్రశాంత వాతావరణంలో గణేశ్ ఉత్సవాలు నిర్వహించుకోవాలి

మల్యాల: గణేశ్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ అన్నారు. గణేశ్ మంటలపాల వద్ద భద్రత, బందోబస్తు నిర్వహించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పోర్టల్‌లో గణేశ్ మంటపాల నిర్వాహకులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గణేశ్ ఉత్సవాలను పురస్కరించుకుని వివిధ ప్రాంతాల్లో గణేశ్ మంటపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. విద్యుత్ శాఖ అనుమతితో విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలని, మంటపాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, మంటపాల వద్ద నిర్వాహకుల సెల్‌ఫోన్ నంబర్లు ఏర్పాటు చేయాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరుగకుండ తగిన జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు, మంటపాల్లో, శోభాయాత్రలో డీజేలకు అనుమతి లేదని, రాత్రి 10గంటల వరకు మాత్రమే స్పీకర్లు వినియోగించాలని సూచించారు.

స్తంభాల చెరువును ఎస్సారెస్పీ నీటితో నింపండి

కోరుట్ల రూరల్: కోరుట్ల మున్సిపల్ విలీన గ్రామం యెఖీన్‌పూర్ శివారులోని స్తంభాల చెరువును ఎస్సారెస్పీ నీటితో నింపాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ఇరిగేషన్ అధికారులకు సూచించారు. గ్రామానికి చెందిన పలువురు రైతులు చెరువులో నీళ్లు లేవని ఆదివారం ఎమ్మెల్యేకు విన్నవించారు. దీంతో ఎమ్మెల్యే ఇరిగేషన్ అధికారులకు ఫోన్ ద్వారా చెరువులో నీళ్లు నింపాలని సూచించారు. చెరువుకు నీళ్లు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తామని అధికారులు ఎమ్మెల్యేకు తెలిపారు.

వరవళ్లు తొక్కుతున్న గోదావరి



ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండిలో నిండుగా ప్రవహిస్తున్న గోదావరి

ఇబ్రహీంపట్నం: రెండు రోజుల నుంచి భారీ వర్షాలు పడుతుండడంతో గోదావరి వరవళ్లు తొక్కుతోంది. మండలంలోని ఎర్దండి వద్ద గోదావరి మొన్నటి వరకు నీళ్లు లేక వెలవెల బోయింది. వర్షాలతో ఆదివారం గోదావరిలోకి నీళ్లు చేరి నిండుగా ప్రవహిస్తూ కళకళలాడుతోంది. గోదావరి వద్ద పుష్కరఘాట్ల వరకు నీళ్లు ప్రవహిస్తున్నాయి. మండలంలోని ఫకీర్‌కొండాపూర్, కోమటికొండాపూర్ పెద్ద చెరువులు మత్తడి పైనుంచి ప్రవహిస్తున్నాయి. ఎర్దండి గోదావరిని, చెరువులను తహసీల్దార్ వరప్రసాద్ సందర్శించి పరిశీలించారు. ఎర్దండి గోదావరిలోకి శ్రీ రాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఎప్పుడైనా నీటిని విడుదల చేసే అవకాశం ఉన్నందునా గోదావరి వైపు ఎవరు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండేందుకు మైక్ ద్వారా ప్రచారం చేయిస్తున్నారు. కార్యక్రమంలో కార్యదర్శి మనోజ్, కారోబార్ రత్నం పాల్గొన్నారు.